

శాస్త్రోక్తంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే శ్రీభ్రమరాంబాదేవికి శాస్త్రోక్తంగా ఊయలసేవ జరిపారు.



జెడ్పీలో పంద్రాగస్టు వేడుకలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,622
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 35,437
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:1,10,614

న్యూస్‌రీల్

23 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు: నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 23 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వీఆర్‌లో ఉన్న ఏడుగురు ఎస్‌ఐలు స్టేషన్లకు నియమితులయ్యారు. స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదుగురు నంద్యాల జిల్లాకు నియమితులు కాగా, నంద్యాల జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న 18 మంది ఎస్‌ఐలను అదే జిల్లాలోని ఇతర స్టేషన్లకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి ఇండియన్ పోలీసు మెడల్



ముఖ్యమంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: డోన్ డీఎస్పీగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన శ్రీనివాసరెడ్డికి ఇండియన్ పోలీసు మెడల్ అవార్డు దక్కింది. గురువారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర దిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా డోన్ సబ్‌డివిజన్‌లోని పోలీసుల అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

దాహం తీర్చారు



హరినగరం ఎస్ఎస్ ట్యాంకు వద్ద శుద్ధి అవుతున్న నీరు

సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఆళ్లగడ్డ, రుద్రవరం మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాను గురువారం ప్రారంభమయ్యింది. గండ్లేరు జలాశయంలో నీరున్నా హరినగరం ఎస్ఎస్ ట్యాంకుకు సరఫరా చేయకపోవడంతో రెండు మండలాల్లోని 40 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంపై గురువారం 'సాక్షి'లో 'నిండా నీరున్నా..తీరదు దాహం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు, నిర్వాహకుల్లో చలనం వచ్చింది. వెంటనే గండ్లేరు జలాశయంలో విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి హరినగరం ఎస్ఎస్ ట్యాంకులోకి నీరు రావడంతో శుద్ధి చేసి ఆళ్లగడ్డ పట్టణంతో పాటు రెండు మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేశారు.



ప్రథమ బహుమతి సాధించిన గ్రామీణ నీటిపారుదల శాఖ శకటం



ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యాశాఖ శకటం



తృతీయ స్థానం కైవసం చేసుకున్న వైద్యారోగ్యశాఖ శకటం

మహనీయుల ఆశయాలు సాధిద్దాం

- ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతూ సుపరిపాలన
- రాష్ట్ర పునఃనిర్మాణానికి చిత్తశుద్ధితో కృషి
- పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఆకట్టుకున్న వివిధ శకటాల ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- నంద్యాలలో ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు



భరతమాత వేషధారణ

గోస్పాడు: ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారి ఆశయాలను సాధించడం అందరి బాధ్యత అని రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, వడ్డే ఓబన్న, కాదర్‌బాద్ నరసింగరావు, బొల్లవరపు వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు

వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతూ సుపరిపాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర పునఃనిర్మాణానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛను పథకం కింద జిల్లాలో జూలై నెల 2,21,240 మంది లబ్ధిదారులకు రూ.150 కోట్లు, ఆగస్టు నెల 2,19,863 మంది లబ్ధిదారులకు రూ.92.88కోట్లు అందించామన్నారు. పీఎంకిసాన్ పెట్టుబడి సాయం కింద 1.96 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.39.20కోట్లు అందిందన్నారు. పంట రుణాల లక్ష్యం రూ.2,874 కోట్లు కాగా.. ఇప్పటి వరకు 94వేల మంది రైతులకు రూ.1,300 కోట్లు బ్యాంకుల ద్వారా అందజేశామన్నారు. జిల్లాలో పశుగ్రాస అభివృద్ధికి 75 శాతం రాయితీతో విత్తనాలను అందిస్తున్నామని చెప్పారు.

జాతీయ రహదారులకు ప్రతిపాదనలు

బనగానపల్లె పట్టణంలో 15 కి.మీ. మేర ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.35 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. జిల్లాలో రూ.255 కోట్లతో పది రోడ్ల పనుల ప్రతిపాదనలను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు పంపామన్నారు. అలాగే తొమ్మిది రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులకు అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. బొమ్మలసత్రం బ్రిడ్జి నుంచి నూనెపల్లె బ్రిడ్జి వరకు రెండున్నర కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారి పనులకు రూ.19 కోట్లు ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసిందన్నారు.

విద్యుత్‌ను ఆదా చేద్దాం

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా 5,40,766 ఎకరాలకు సాగునీటిని అందించనున్నామని మంత్రి తెలిపారు. కేసీ కెనాల్ కింద 1,69,745, ఎస్ఆర్‌బీసీ కింద 1,53,936 , తెలుగుగంగ కింద 1,24,459 ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 38 ఎత్తిపోతల పథకాల ద్వారా 5,875, సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 21,300 , హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 2,000 ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన కింద ప్రజలు సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు మంత్రి, కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.



జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, జేసీ విష్ణుచరణ్

ఆకట్టుకున్న శకటాలు, స్టాళ్ల ప్రదర్శన

పంద్రాగస్టు వేడుకల్లో శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. పోలీసు శాఖ వారి వజ్ర, డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయం, స్త్రీ సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గనులు భూగర్భ జల శాఖ, పర్యాటక శాఖ, విద్యా, వైద్య ఆరోగ్యం, ఉద్యానవనం, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లయ్, అగ్నిమాపక తదితర శకటాలను ప్రదర్శించారు. గ్రామీణ నీటి సరఫరా, విద్యాశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలకు మొదటి మూడు బహుమతులు లభించాయి. ఎగ్జిబిషన్ స్టాల్స్‌కు సంబంధించి డ్వామా, ఉద్యాన, డీఆర్‌డీఏ శాఖలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. మార్చ్‌ఫాస్ట్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రథమ బహుమతి, ఏఆర్‌ప్లాటున్ ద్వితీయ బహుమతి, ఎన్‌సీసీ విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కేశవ రెడ్డి , గురురాజ , ఏపీ ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు వరుసగా మూడు బహుమతులను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.



పోలీసుల కవాతు



సన్మానం అందుకున్న సాతంత్ర్య సమరయోధుల వారసులు



వేడుకలకు హాజరైన విద్యార్థులు, అధికారులు, ప్రజలు



వందేమాతరం.. విద్యార్థినుల నృత్య ప్రదర్శన





స్వాతంత్ర్య సమరంలో ప్రధాన ఘట్టాలను వివరిస్తూ గురురాజా స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు

దేవస్థానం నిర్లక్ష్యం.. అగ్గితో చెలగాటం

- శ్రీశైలంలో వసతి గృహాల మధ్య కొబ్బరి చిప్పల నిల్వ కేంద్రం
- తరచూ అగ్ని ప్రమాదాలతో స్థానికులు బెంబేలు
- శివారులో పెడ్డు ఏర్పాటులో దేవస్థానం నిర్లక్ష్యం



2022లో కొబ్బరిచిప్పల నిల్వ కేంద్రంలో అగ్నిప్రమాదం

శ్రీశైలంటెంపుల్: చేతులు కాలాక కూడా ఆకులు పట్టుకోలేదంటే.. ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. శ్రీశైలం దేవస్థానం అధికారులు ఈ కోవకు చెందినట్లుగా కనిపిస్తున్నారు. వసతి గృహాల మధ్య తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు ఏమీ ఎరుగనట్లుగా వ్యవహరిస్తున్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం అనునిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. క్షేత్రానికి విచ్చేసే భక్తుల్లో ఎక్కువ మంది స్వామిఅమ్మవార్లకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కలు తీర్చుకుంటారు. స్వామి అమ్మవార్లకు సమర్పించే కొబ్బరికాయ చిప్పలను పోగుచేసుకునేందుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ నిర్వహించారు. అమలాపురానికి చెందిన సూరయ్య టెండర్ దక్కించుకున్నారు. ఇతనికి దేవస్థానం వసతి గదిని కేటాయించింది. ఆ వసతి గృహం వద్దనే టెండర్ దారుడు తాత్కాలికంగా కొబ్బరిచిప్పల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నిల్వ కేంద్రం దేవస్థాన సిబ్బంది వసతి గృహాల మధ్య ఉంది. కొబ్బరి చిప్ప నుంచి కొబ్బరిని వేరుచేసేందుకు ఎండాకాలంలో అయితే ఆరుబయట ఎండకు ఆరబెట్టడం ద్వారా సులువుగా వేరు అవుతుంది. అయితే చలి కాలం, వానా కాలంలో నిప్పుల కుంపటి పెడతారు. ఈ నిప్పుల కుంపటిలో కొబ్బరి పడినా లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినా అగ్నిప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. అసలే వసతి గృహాల మధ్య ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవతున్నారు. ఇంత జరుగుతున్న దేవస్థాన అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఆ మల్లన్నకే తెలియాలి.



కొబ్బరిచిప్పల నిల్వ కేంద్రం

ఇప్పటికే మూడు సార్లు..

శ్రీశైలంలో కొబ్బరిచిప్పల నిల్వ కేంద్రంలో ఈ నెల 6వ తేదీన అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడడంతో సమాచారం తెలుసుకుని తక్షణమే దేవస్థానం స్పందించి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఇప్పటికే కొబ్బరి చిప్పల నిల్వ కేంద్రంలో రెండుసార్లు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన ప్రమాదం మూడోవది. కొబ్బరి చిప్పల నిల్వ కేంద్రం దేవస్థాన సిబ్బంది వసతి గృహాల మధ్య ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తమవుతోంది.

15 నెలలు గడిచినా షెడ్డు నిర్మించలేదు

టెండర్ సమయంలోనే కొబ్బరి చిప్పలు నిల్వ చేసుకునేందుకు, చిప్పల నుంచి కొబ్బరిని వేరు చేసేందుకు భారీ షెడ్డు ఏర్పాటు చేయాలని మేము కోరాం. అందుకు దేవస్థాన అధికారులు స్పందించి శ్రీశైలంలో ఫిల్టర్‌బెడ్ వద్ద భారీ షెడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే 15 నెలలు గడిచినా ఇంతవరకు షెడ్డు నిర్మించలేదు. కొబ్బరిని నిల్వ చేసుకునేందుకు మాకు ఎక్కడా అవకాశం లేదు. దేవస్థాన అధికారులు త్వరగా నిర్మిస్తే అక్కడికి వెళ్తాం. ప్రస్తుతం ఉన్న స్థలంలో కొబ్బరిచిప్పలు నిల్వ చేసుకునేందుకు, ఆరబెట్టేందుకు అనువుగా లేదు. కొబ్బరి పాడైపోయి నేను నష్టపోతున్నా.

– సూరయ్య, కొబ్బరిచిప్పల టెండర్‌దారుడు

నిల్వకు అనుమతి లేదు



దేవస్థాన గృహాల మధ్య కొబ్బరికాయల నిల్వ కేంద్రం ఉండకూడదని కాంట్రాక్టర్‌కు నోటీసు ద్వారా తెలిపాం. తక్షణమే అక్కడి నుంచి ఖాళీ చేయించాలని అధికారులకు కూడా ఆదేశాలిచ్చాం. కొబ్బరి చిప్పల నిల్వకు మాత్రమే అతనికి గదిని కేటాయించాం. వసతి గృహం వద్ద నిప్పుల కుంపటి అసలు పెట్టకూడదు. అలా చేయాలంటే దేవస్థాన అనుమతితో వసతి గృహాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

రాజకీయ ఆధిపత్యం కోసమే శ్రీనివాసులు హత్య!

వైఎస్సార్‌సీపీపై నిందమోపే యత్నం

- సోషల్ మీడియా వేదికగా విష ప్రచారం
- పోలీసుల అదుపులో టీడీపీ వర్గీయులు

తుగ్గలి(పత్తికొండ): అధికార టీడీపీలో ఆధిపత్య పోరు హత్యా రాజకీయాలకు దారితీస్తోంది. పార్టీలో, గ్రామాల్లో పట్టు కోసం సొంత పార్టీలోని ప్రత్యర్థి వర్గాన్ని మట్టుబెడుతున్నారు. తాజాగా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసులును అదే గ్రామానికి చెందిన అధికార పార్టీలోని ప్రత్యర్థి వర్గం నాయకులు తలపై రాడ్లతో కొట్టి అత్యంత దారుణంగా హతమార్చిన ఘటన కలకలం రేపింది. వాకిటి శ్రీనివాసులు సుమారు 20 సంవత్సరాలుగా కెఈ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అతని భార్య శారదమ్మ సర్పంచ్‌గా గెలుపొందింది. రెండు నెలల క్రితం టీడీపీ అధికారంలోకి రావడంతో పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతని మాటే చెల్లుబాటు అవుతుండటంతో పాటు పత్తికొండ మండల సహకార సంఘం అధ్యక్షుడిగా అయితే బాగుంటుందని చర్చ స్థానిక ఎమ్మెల్యే వద్ద కూడా వచ్చింది.

బతికుంటే పట్టు సాధించలేమనే..

మొదటి నుంచి టీడీపీకి, కెఈ కుటుంబానికి గ్రామంలో ఏకైక నాయకుడిగా ఉన్న శ్రీనివాసులకు గత మూడు సంవత్సరాల నుంచి మరో వర్గం తయారైంది. వీరికి తోడు సరిహద్దులో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన మరో వ్యక్తి తోడు కావడంతో ప్రత్యర్థి వర్గం మరింత బలపడింది. అయితే రెండు వర్గాలను రాజీ చేయకుండా ఇరువర్గాలను వేర్వేరుగా పెంచి పోషిస్తూ వచ్చింది కేఈ కుటుంబం. ఈ క్రమంలో గత సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి కొట్టుకున్నారు. ఆ సందర్భంగా కేఈ కుటుంబ సభ్యులు శ్రీనివాసులుకే వత్తాసు పలకడం, ఎన్నికల తర్వాత కూడా ఆయన హవా కొనసాగుతుండటంతో ప్రత్యర్థి వర్గం జీర్ణించుకోలేకపోయింది. ఇక ఇతను జీవించి ఉంటే ఎన్నిరోజులైన మనం ఎదగలేమని భావించి హత్య చేసినట్లు చర్చ జరుగుతోంది.

ఒక హత్య.. వంద అబద్ధాలు

అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు, వ్యక్తిగత విభేదాలు వెరసి ఓ వర్గానికి చెందిన నాయకుడి హత్యకు దారితీసింది. ఘటన జరిగిన వెంటనే నిజానిజాలు తెలుసుకోకుండా.. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఈ ఘటనతో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నా టీడీపీ నాయకులు హత్యా రాజకీయానికి తెరలేపారు. పచ్చ మీడియా పూనకం వచ్చినట్లు హడావుడిగా బ్రేకింగ్ అంటూ వైఎస్సార్సీపీ, పార్టీ నేతలపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా వేదికగా విష ప్రచారానికి పూనుకున్నారు. హంతకులు టీడీపీ నాయకులే అయినప్పటికీ వాస్తవాలను కప్పిపుచ్చి మంత్రి లోకేష్ సైతం అబద్ధాలు ప్రచారం చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

శ్రీనివాసులు హత్య కేసుకు సంబంధించి టీడీపీకి చెందిన సీఆర్‌పీఎఫ్ మాజీ జవానుతో పాటు మరో ముగ్గురు టీడీపీ నేతలను బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కర్నూలు ఎస్పీ కార్యాలయానికి తరలించారు. గురువారం అదేపార్టీకి చెందిన మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కర్నూలుకు తరలించినట్లు సమాచారం.

క్లుప్తంగా

జెండావిష్కరణకు వెళ్లనీయకుండా..

కృష్ణగిరి ఎంపీపీని అడ్డుకున్న పోలీసులు

కృష్ణగిరి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కణకు కర్నూలు నుంచి వస్తున్న కృష్ణగిరి మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కంగా టి వెంకటరామిరెడ్డిని వెల్దుర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వెల్దుర్తి వద్ద హైవేపై పోలీసులు ఎంపీపీ కారును ఆపి సర్కిల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున జెండా అవిష్కరణకు వెళ్లుతున్న తనను అడ్డు కోవడం ఏంటని పోలీసులను ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ నిలదీశారు. టీడీపీ నాయకులకు వత్తాసు పలకడం తగదన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఏర్పడుతుందని ఆయనకు సీఐ మధుసూదన్‌రావు నచ్చజెప్పారు. ఇదిలా ఉండగా.. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ విశ్వమోహన్ జెండావిష్కరణ చేశారు. మండలానికి ఎంపీపీ వస్తున్నాడని తెలిసి ఓ వైపు టీడీపీ కార్యకర్తలు, మరో వైపు వైసీపీ కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎంపీపీని మండలానికి రాకుండా అడ్డుకోవడాన్ని చూసి స్వాతంత్య్ర దినోత్సవం నాడు రాజకీయాలేంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితపై వేటు

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీ కాలనీలోని కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె 11 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారు. పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెల 25న జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. భోజనాలు సరిగా పెట్టడం లేదని, పస్తులుండాల్సి వస్తోందని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెనూ మార్చడం..రిజిష్టర్‌లో మాత్రం మెనూ ప్రకారం వడ్డించినట్లు నమోదు చేయడాన్ని అధికారులు గుర్తించారు. విచారణ తరువాత షోకాజ్ నోటీసు ఇచ్చినా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆమెను కాంట్రాక్ట్ ఒప్పంద ప్రిన్సిపాల్ ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈఓ ఉత్తర్వులు ఇచ్చారు.

అనంతపురం వాసి మృతదేహం లభ్యం

కర్నూలు: కర్నూలు శివారులోని ఔటర్ రింగ్ రోడ్డులోని టిడ్కో ఇళ్లకు సమీపంలో కాదంబరి టౌన్‌షిప్ వద్ద అనంతపురం వాసి మద్దిలేటి గారి నాగభూషణం (45) మృతదేహం లభ్యమైంది. గురువారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం ఆవులపల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఫోన్ ద్వారా అతని కుటుంబ సభ్యులకు సమాచారం చేయవేయగా తల్లి చౌడమ్మ కర్నూలుకు చేరుకున్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గురువారం నంద్యాల గవర్నమెంట్ కాలేజీ మైదానంలో నిర్వహించిన ఉత్సవాల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఆర్ఓ పద్మజ

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





క'రుణ' చూపకున్నా.. కాకిలెక్కలు!

- 2024-25 వార్షిక రుణ ప్రణాళిక రూ.15,068.46 కోట్లు
- ఖరీఫ్ పంట రుణాల లక్ష్యం రూ.2,873.96 కోట్లు
- జూన్ చివరి నాటికే రూ.2,335.35 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు
- ఎంఎస్ఎంఈ కింద మూడు నెలల్లోనే రూ.1189.83 కోట్లు పంపిణీ చేశారట!

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేయలేదు. రుణాల పంపిణీపై అనిశ్చితి ఉంది. అధికారికంగా ఈ నెల మూడో వారంలో వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ రుణాల పంపిణీ మాత్రం ముమ్మరంగా జరుగుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికను రూ.15,068.46 కోట్లతో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) రూపొందించినట్లు తెలుస్తోంది. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.7,746.84 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. అయితే జూన్ 31 వరకు ఉన్న లెక్కలను పరిశీలిస్తే వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకర్లు అంకెల గారడీకి పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.3,066 కోట్లు రుణాలుగా పంపిణీ చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

➤ ఖరీఫ్ పంట రుణాల లక్ష్యం రూ.2,873.96 కోట్లు ఉండగా.. ఇందులో రూ.2,335.35 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి. 2023 ఖరీఫ్ పంట రుణాలను రెన్యువల్ చేయడం ద్వారా పంట రుణాల పంపిణీలో రూ.77.78 శాతం ప్రగతి సాధించినట్లు చూపడం గమనార్హం. 2023 ఖరీఫ్ సీజన్‌లో అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెల చివరి వరకు పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.2,926.01 కోట్లు ఉండగా.. 2,31,731 మంది రైతులకు రూ.3,312.89 కోట్లు పంపిణీ చేశారు. ఈ సారి ఖరీఫ్‌లో మాత్రమే జూన్ నాటికే రూ.77.78 శాతం పంపిణీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి.

➤ ఈ ఖరీఫ్‌లో కొత్త రైతులకు, కౌలుదారులకు రుణాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, సాగుదారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కక, బ్యాంకులు పట్టించుకోక పోవడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

➤ అగ్రికల్చర్ టర్మ్‌లోన్ల కింద రూ.468.08 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కింద రూ.12.87 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.350.63 కోట్లు ప్రకారం మొత్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.3066.53 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

➤ వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఇ) కింద రూ.2,560.77 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యం.అయితే మొదటి మూడు నెలల్లోనే రూ.1,189.83 కోట్లు పంపిణీ చేసి 46.49 శాతం ప్రగతి సాధించినట్లు లెక్కలు ఉన్నాయి.

➤ ఈ ఏడాది జూన్ 31 వరకు విద్యా రుణాలు రూ.14.66 కోట్లు, హౌసింగ్ రుణాలు 11.51 కోట్లు, రెనెవబుల్ ఎనర్జీ కింద రూ.4.24 కోట్లు, ఇతర రుణాలు 145.11 కోట్లు, నాన్ ప్రియారిటీ సెక్టారులో రూ.1368.72 కోట్లు ప్రకారం మొత్తంగా రూ.5800.61 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

తల్లిదండ్రులూ.. మీ పిల్లలు జాగ్రత్త!



ఒక బైక్‌పై నలుగురు.. అందులో అందరూ మైనర్లు. రయ్..రయ్ మంటూ రోడ్డుపై ఫీట్లు చేస్తూ గురువారం కొలిమిగుండ్లలో కనిపించారు. ఈ ప్రధాన రహదారిపై గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. రోడ్డుపైకి వెళ్లాంటే భయపడాల్సిన రోజులివి. వాహనాల సంఖ్య పెరగడం, వేగంగా ప్రయాణిస్తుండంతో ప్రమాదం ఎటువైపు నుంచి దూసుకెస్తుందో చెప్పలేని పరిస్థితి. ఎంత జాగ్రత్తగా ఉన్నా రెప్పపాటులో ఘోర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాలు తెలిసినా పిల్లల చేతికి వాహనాలు ఇవ్వడం ఎంత వరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. - కొలిమిగుండ్ల

తంగరడోణ దశమి ఉత్సవాల్లో అపశృతి

- బాణసంచా పేలి 17 మందికి గాయాలు



ఆలయ ఆవరణలో బాణసంచా పేలి మంటలు ఎగిసిన దృశ్యం



క్షతగాత్రుల వివరాలు సేకరిస్తున్న ఆస్పరి సీఐ మస్తాన్‌వలి

ఆస్పరి: తంగరడోణ గ్రామంలో గురువారం చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. బాణసంచా పేలి 17 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు, ఆస్పరి సీఐ మ స్తాన్ వలి తెలిపిన వివరాల మేరకు.. ఉత్సవాల్లో భా గంగా గురువారం తెల్లవారుజామున స్వాముల అశ్వాన్ని మేళతాళాలతో ఊరేగించేందుకు చింతలమునిస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. అప్పటికే పెద్ద ఎత్తున జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ భక్తులు అక్కడికి చేరుకున్నారు. సంప్రదాయం ప్రకారం మొదట చింతలముని స్వా మి ఆలయంలో భక్తులు పూల బాణాలు విడుస్తుండగా అగ్గిరవ్వలు ఆలయ మండపం సమీపంలో ఉంచిన బాణసంచా సంచిపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా పే లడంతో మంటలు ఎగిసి పక్కనే ఉన్న భక్తులకు మంటలు వ్యాపించడంతో తీవ్రంగాగాయపడ్డారు. గాయపడిన వారిలో రాయచూర్‌కు చెందిన బడెప్ప, సరోజమ్మ, గోవిందమ్మ, తేజశ్విని, పుష్పావతి, అకుల్, రంజిత, అలంపూర్‌కు చెందిన మంజునాథ్, పద్మ, తంగరడోణకు చెందిన శ్రీనివాసులు, ఈరన్న, ఆదోని మండ లం సలకలకొండకు చెందిన ఉరుకుందురెడ్డి, ఈరన్న, తుగ్గలి మండలం రాంపురానికి చెందిన చంద్ర, ముకెళ్లకు చెందిన మునెప్ప, బైలుపత్తికొండకు చెందిన కురు వ లింగయ్య, గోనెగండ్ల మండలం బైలుప్పలకు చెంది న కుంతీదేవి తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందతున్నారు. ఈమేరకు ఆలయ దర్మకర్త మండలి సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- రౌడీషీటర్లు కిడ్నాప్ చేసి హత్య చేశారని తల్లిదండ్రుల ఆరోపణ
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



వాహిద్ (ఫైల్)



బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీస్తున్న దృశ్యం

ఆత్మకూరు రూరల్: రెండు రోజుల క్రితం ఆత్మకూరు పట్టణంలో అదృశ్యమైన ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పోలీసులు, విద్యార్థి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు పట్టణానికి చెందిన అజ్మతుల్లా కుమారుడు వాహిద్ (17) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 13వ తేదీన వాహిద్‌ను కళాశాల నుంచి కొందరు వ్యక్తులు బయటకు తీసుకెళ్లారు. అయితే కళాశాలకు వెళ్లిన కుమారుడు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కొందరిపై అనుమానం కూడా వ్యక్తం చేయడంతో పోలీసులు ముగ్గురిని అదుపులోనికి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. అంతే కాకుండా సీసీ ఫుటేజీలను కూడా పరిశీలించారు. వాహిద్‌ను రహస్య ప్రదేశానికి తీసుకు వెళ్లి హింసించినట్లు నిందితులు ఒప్పుకున్నప్పటికీ ఆ తరువాత తాము వదలి వేసినట్లు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే గురువారం విద్యార్థి మృతదేహం స్థానిక వాటర్‌వర్క్స్ బావిలో బయటపడటంతో ఎస్ఐ నారాయణ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడా? లేక కిడ్నాప్ చేసిన రౌడీ గ్యాంగ్ హత మార్చిందా? అనే విషయాలు తేలాల్సి ఉంది. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. విద్యార్థి శవం బయటపడడంతో ముమ్మర దర్యాప్తు చేస్తామన్నారు.